క్లుప్తంగా

డాక్టరేట్ సాధించిన ఉపాధ్యాయుడికి సన్మానం



నిజామాబాద్ అర్బన్: డాక్టరేట్ సాధించిన శ్రీనివాస్‌రాజును మంగళవారం ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తన కార్యాలయంలో సన్మానించారు. రుద్రూర్ ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బట్టు శ్రీనివాస్ రాజుకు డాక్టరేట్ లభించింది. అనంతరం ఇంటర్ అధికారి రఘురాజ్ మాట్లాడుతూ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఆంగ్లంలో పీహెచ్‌డీ పూర్తి చేయడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయుడు భుజంగం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా ఇవ్వాలి

సుభాష్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగం గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు డీఎస్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. వివిధ మండలాల అధ్యక్షులు రాజేశ్వర్, మహేష్, ప్రశాంత్, హరప్ప పాల్గొన్నారు.

12 రకాల సరుకులు అందించాలి



సుభాష్‌నగర్: ప్రజలకు రేషన్‌షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు అందజేయాలని, సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు గోదావరి డిమాండ్‌చేశారు. ఈమేరకు మంగళవారం వారు కలెక్టర్ రాజీవ్‌గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని, వంట గ్యాస్‌ను సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. నాయకులు సంధ్యారాణి, సాయిలు, మారుతీగౌడ్, సత్తెమ్మ, లక్ష్మీ, పద్మ, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించండి



ఖలీల్‌వాడి: నగరంలో రోడ్లపై పశువులను నియంత్రించాలని హిందూఐక్యవేదిక నాయకులు మంగళవారం ఏసీపీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లపై గోసంతతి సంచారంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశువులు రోడ్లపై తిరగకుండా వాటి యజమానులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ధాత్రిక రమేష్, జయకృష్ణ, శ్రీధర్, పాండురంగారావు, అనిల్ కధం, శ్రీకాంత్, నరేష్‌గౌడ్ ఉన్నారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఈనెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి అనిల్ కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధి కోసం సమావేశాలలో చర్చించబోతున్నామని అన్నారు. జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్, కార్యదర్శి మహేష్, ప్రసాద్, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సీ ఆపరేషన్ రవీందర్ పేర్కొన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని విద్యుత్ కార్యాలయంలో నిజామాబాద్ డివిజన్ విద్యుత్ కార్మికులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు కాపాడడానికి శక్తివంచన లేకుండ ప్రమాదాల నివారణకు కృషి చేయలన్నారు. సీఎండీ గోపాల్‌రావు పంపిన సందేశంతో అందరు ప్రతిజ్ఞ చేశారు. డీఈ ఆపరేషన్ శ్రీనివాస్, డీఈ రమేష్, ఏడీఈలు చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశం, ఆశోక్, సుహాసిని, డివిజన్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ కాదు.. పరిహారమివ్వండి

- అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల ఆవేదన
- నియోజకవర్గంలో వేల ఎకరాల్లో నేలరాలిన వరి



మైలారంలో దెబ్బతిన్న వరి పైరు (ఫైల్)



నల్లవెల్లిలో నేలకొరిగిన నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఇందల్వాయి : ఇరవై రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు పంటలు చేతికందక, పెట్టిన పెట్టుబడులు రాక తీవ్ర మనోవేదనలో ఉన్నారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో అధికారులు,ప్రజా ప్రతినిధులు పర్యటిస్తున్నా పంట నష్ట పరిహారంపై మాత్రం రైతులకు పూర్తి దీమా ఇవ్వలేకపోతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టాకే తూకం వేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ గన్నారం పర్యటనలో అనడమే ఇందుకు నిదర్శనం.

రూరల్‌లో.. 6,499 ఎకరాల్లో..

ఏప్రిల్ నెలలో ఈదురు గాలులు, వడగల్లతో కురిసిన భారీ వర్షాలకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 6,499 ఎకరాల్లో వివిద రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో 51 గ్రామాల్లో 3325 మంది రైతులకు చెందిన 5977 ఎకరాల్లో వరి, 4 గ్రామాల్లో 198 మంది రైతులకు చెందిన 342 ఎకరాల్లో నువ్వుపంట, 80 మంది రైతులకు చెందిన 189 ఎకరాల్లో మామిడి పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది.

గతంలో లాగే..

ఈ ఏడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల క్రితం పరిహారాన్ని మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో 487 మంది రైతులకు ఎకరానికి రూ. 10 వేల చొప్పున 48.70 లక్షల నిధులను విడుదల చేసింది. ఈసారి కూడా అలాగే పరిహారాన్ని పెంచి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పంట వడగళ్ల పాలు..



మైలారంలో వారం రోజుల క్రితం కురిసిన వడగల్ల వర్షానికి ఆరు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో నువ్వు పంట నష్టపోయాం. ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకొని పెట్టుబడుల పూర్తయినా ఎకరానికి రూ. 20 వేల పరిహారం ఇవ్వాలని కోరుతున్నాం.

– బాజయ్యగారి శ్రీనివాస్ రెడ్డి, రైతు, మైలారం.

నీళ్లలో కొట్టుకుపోయింది..



ఆరబెట్టిన ఏడు ట్రాక్టర్ల ధాన్యంలోంచి వర్షం నీరు పారి రెండు ట్రాక్టర్ల ధాన్యం మట్టిలో కొట్టుకు పోయింది. రెండు ట్రాక్టర్లకు పైగా ధాన్యం రంగుమారి మొలకలు వచ్చి చేతికందకుండా పోయింది. ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రంలోనే ఉంది. నష్టపోయిన ధాన్యానికి పరిహారం అందించాలి. – విస్లవత్ మోజీరాం, స్టేషన్ తండా, ఇందల్వాయి

అధికారులకు నివేదిక పంపుతున్నాం..

రూరల్ డివిజన్‌లో పంట నష్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి పైఅధికారులకు నివేదిక అందిస్తున్నాం. ఇప్పటి వరకు సుమారు ఆరున్నర వేల ఎకరాలకు పైగా పంట నష్టాన్ని అంచనా వేసి పూర్తి వివరాలను జిల్లా వ్యవసాయ అధికారికి అందజేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పంట నష్టం జరిగిన ప్రతీ రైతు వద్దకు వెళ్లి వ్యవసాయ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

– ప్రదీప్ కుమార్, ఏడీఏ, నిజామాబాద్ రూరల్

ఆగని వాన..



ఘన్‌పూర్‌లో వర్షపు నీటిలో నుంచి వడ్లను ఎత్తుతున్న మహిళా రైతు



నల్లవెల్లిలో ధాన్యం కుప్పల వద్దకు చేరిన నీరు



కంజర గ్రామంలో..



మల్లారంలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

డిచ్‌పల్లి/ఇందల్వాయి/నిజామాబాద్ సిటీ/మోపాల్(నిజామాబాద్‌రూరల్): అన్నదాతపై వరుణుడు కరుణ చూపడం లేదు. పంట చేతికందిన సమయంలో అకాల వర్షాలు, వడగళ్ల వాన, ఈదురుగాలులు రైతు ఆశలను అడియాసలు చేస్తున్నాయి. సుమారు పది రోజులుగా ప్రతిరోజూ వర్షం దంచికొడుతోంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్ సహా పలు మండలాల్లో జోరు వాన కురిసింది. దీంతో వరిపైరు నేలకొరిగి ధాన్యం రాలిపోయింది. ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మోపాల్ మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రా థమికంగా అంచనావేశారు. నిజామాబాద్ రూరల్ మండలంలో 900 ఎకరాలలో పంటనష్టం జరిగింద ని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించారు. 70శాతం కోతలు జరిగినట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి హీరా జాదవ్ తెలిపారు. దెబ్బతిన్న పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. నిజామాబాద్ రూరల్ మండలం కొత్తపేట్ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన ఈదురుగాలులు, వర్షాలకు నాలుగు ఇళ్లు నేలకూలాయి. వీఆర్వో స్వామి నిరాశ్రయులకు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆశ్రయం కల్పించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..



ఫంక్షన్ హాల్‌ను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో

సిరికొండ: మండలంలోని మైలారం పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారులపై తగిన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు తెలిపారు. అక్రమంగా నిర్మించిన ఫంక్షన్‌హాల్, ఇంటి నిర్మాణం పేరిట అనుమతులు తీసుకొని 20 మడిగెలు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గురించి గత నెల 21న 'యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన' పేరిట సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలపై డీఎల్‌పీవో నాగరాజు విచారణ కోసం మంగళవారం మండలానికి వచ్చారు. ఫంక్షన్ హాల్‌ను, 20 మడిగెలను ఆయన తనిఖీ చేశారు. ఇవి రెండు అక్రమ నిర్మాణాలేనని డీఎల్‌పీవో తేల్చారు. నిర్మాణదారులకు నోటీసులు జారీ చేస్తామని, డీపీవోకు నివేదిక సమర్పిస్తానని, వారి ఆదేశానుసారం తగిన చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో తెలిపారు. నిర్మాణంలో ఉన్న మరో ఫంక్షన్‌హాల్‌ను ఆయన తనిఖీ చేశారు. అనుమతి వచ్చేంత వరకు నిర్మాణాలు చేపట్టవద్దని డీఎల్‌పీవో ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మూడుబోట్ల ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా చూడాలని ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌ను ఆదేశించారు.

పారిశుధ్య కార్మికుల సేవలకు సలామ్!



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: పట్టణాలు, పల్లెల అభివృద్ధిలో పారిశుధ్య కార్మికులే కీలక పాత్ర పోషిస్తున్నారని, వెలకట్టలేని మీ సేవలకు సలామ్ అంటూ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా నగరంలోని శ్రీరామ గార్డెన్స్‌లో మంగళవారం మున్సిపల్ కార్మికులతో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న కార్మికులకు వేతనాలు పెంచారన్నారు. నగరంలో కార్మికులకు పనిభారం తగ్గించేందుకు కొత్త సిబ్బందిని నియమించామన్నారు. అర్బన్‌లో ఉన్న 1500మంది కార్మికలకు జీతాల పెంపుతో పాటు బట్టలు పంపిణీ చేశామన్నారు. మీకు ఏ కష్టం ఆపద వచ్చినా మీకు అండగా ఉంటానని తెలిపారు. పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నారు. మేయర్ నీతూకిరణ్, నుడాచైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించండి





కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు.. సికింద్రాపూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్
- కలెక్టర్‌కు మెమోరాండం అందజేత

సుభాష్‌నగర్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటనష్టం వివరాలతో కూడిన మెమోరాండంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆకాశం వైపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక ఎమ్మెల్యే పార్టీ ప్లీనరీలు, మరో ఇద్దరు మహారాష్ట్రలో బీఆర్ఎస్ కార్యకలాపాలు, మంత్రి ఢిల్లీ, హైదరాబాద్‌లో పార్టీ భవన నిర్మాణ పనుల్లో బిజీబిజీగా ఉన్నారని ఎద్దేవాచేశారు. అధికారులు మీరైనా అన్నదాతల కష్టాలు తీర్చాలని విజ్ఞప్తిచేశారు. లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, కిసాన్ ఖేత్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజ్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి మండలంలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్, జక్రాన్‌పల్లి గ్రామాల్లో అకాల వర్షాలతో నష్టపోయిన వరి, నువ్వులు, టమాట పంటలను కాంగ్రెస్ రూరల్ ఇన్‌చార్జి డాక్టర్ భూపతిరెడ్డి ప్రభుత్వాన్ని పరిశీలించారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ మండలంలో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మోపాల్, కాస్‌బాగ్‌తండా, నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లిలో పంటపొలాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీసీసీ ప్రధానకార్యదర్శి కాట్‌పల్లి నగేష్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, మంత్రులు ఆత్మీయ సమ్మేళనాలు, ప్రారంభోత్సవాల్లో బిజీబిజీగా ఉన్నారని, పంట నష్టంపై రైతుల గురించి పట్టించుకునే నాథుడే లేడని ఆరోపించారు. మాజీ ఎంపీపీ యాదగిరి, మండల అధ్యక్షుడు రవి, సాంబయ్య, బుచ్చన్న, అన్నదాతలు ఉన్నారు.

సమాచారం

రేపు ఇందల్వాయి మండల పరిషత్ సమావేశం

ఇందల్వాయి: ఇందల్వాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పదిన్నర గంటలకు ఎంపీపీ రమేష్‌నాయక్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాములు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

7న నాయకపోడు జిల్లా సంఘం ఎన్నికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా నాయకపోడు సంఘం ఎన్నికలు ఈ నెల 7న ఆర్మూర్‌లోని జర్నలిస్టు కాలనీ తాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా సంఘం ఎన్నికల అధికారి బండారి భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి ఇద్దరు పెద్ద మనుషులు తప్పకుండా రావాలన్నారు.

28న వధూవరుల పరిచయవేదిక



డిచ్‌పల్లి: నిర్మల్ జిల్లా బాసరలో ఈ నెల 28న గాండ్ల తెలికుల వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇందల్‌వాయి కిషన్ తెలిపారు. ఈమేరకు డిచ్‌పల్లి లో మంగళవారం వధూవరుల పరిచయ వేదిక పోస్టర్లను ఆవిష్కరించారు. పరిచయ వేదికలో పాల్గొనే ఆసక్తిగల వధూవరుల తల్లిదండ్రులు తమ పేర్లను మొబైల్ నెంబర్లు 93970 95881 (కిషన్), 98761 40555 (శ్రీనివాస్)ను సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. రూరల్ అధ్యక్షుడు రాసమల్లు శ్రీనివాస్, సభ్యులు మహేష్, ఆర్.గంగాధర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

వైష్ణవి రెసిడెన్సీ..



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక నగర్ వైష్ణవి రెసిడెన్సీ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాంచారి గోపి, ఉపాధ్యక్షులుగా నిర్మల హృదయ కుమారి, జాన్సన్, ప్రధాన కార్యదర్శిగా కెవి కృష్ణారావు, జాయింట్ సెక్రటరీగా మనోహర్, పద్మ, కోశాధికారిగా సురేష్, కార్యవర్గ సభ్యులుగా వెంకట్రావు ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల పండుగ





మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్‌లో ఎల్లమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. వేదపండితులు అమ్మవారి కల్యాణం, మహాముని జమదగ్ని యజ్ఞం వంటి పూజాకార్యక్రమాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసాయని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

సిరికొండ: మండలకేంద్రంలో ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులను చెల్లించుకున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,850	వెండి (కిలో)	76,000
22 క్యారెట్స్	57,046	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	35	50
బెండకాయ	15	30	గాజరుగడ్డ	20	30
జీరకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	10	20	దోసకాయ	15	30
బీర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	35	60	గోబిగడ్డ	10	20
వంకాయ	12	24	గోబిపువ్వు	20	40
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	60
పుదీనా	25	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్-1- -పొన్నియిన్ సెల్వన్ భాగం-2- 1.15 7.25 10.35
స్క్రీన్-2- విరూపాక్ష -1.25 7.30 10.25
కిస్ కా భాయ్- కిసి కీ జాన్(హిందీ)-4.25
స్క్రీన్-3 - ఏజెంట్ -1.30 7.40 10.40
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1- ఏజెంట్ -10.40 9.10
పొన్నియిన్ సెల్వన్ భాగం-2 -2.00
కిస్ కా భాయ్ -కిసి కీ జాన్(హిందీ)-6.00
స్క్రీన్-2- ఏజెంట్ - 12.00 3.20 6.40 10.00
స్క్రీన్-3--పొన్నియిన్ సెల్వన్ భాగం-2 -11.20 2.50 6.20 9.50
స్క్రీన్-4- విరూపాక్ష -10.00 1.05 4.10 7.15 10.20
దేవి — పొన్నియన్ సెల్వన్ 2
నటరాజ్ — కిసి కా భాయ్-కిసి కీ జాన్ (హిందీ)
లలితామహల్ — ఏజెంట్
విజయ్ — విరూపాక్ష

అటెండర్ తొలగింపుపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో కంటింజెన్ (అటెండర్)గా విధులు నిర్వర్తిస్తున్న గాయత్రిని విధుల నుంచి తొలగించడంపై అంబేడ్కర్ యువజన సంఘం మండల నాయకులు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో గాయత్రి ఆస్పత్రిలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిందని గుర్తుచేశారు. అక్రమ తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని, సీనియర్ అసిస్టెంట్ సలీంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. గాయత్రిని అటెండర్‌గా కొనసాగించాలని కోరారు.

సంక్షిప్తం

జిల్లాకు రూ.200 కోట్లు విడుదల చేయాలి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలో పంట నష్టానికి పరిహారంగా తక్షణమే రైతులకు రూ. 200 కోట్లు విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు మంగళవారం పార్టీ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు.

టీఎన్‌జీవో అధ్యక్ష, కార్యదర్శికి సన్మానం

సుభాష్‌నగర్: టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడిగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన అలుక కిషన్, ప్రధానకార్యదర్శి నేతికుంట శేఖర్‌ను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, సాయన్న, మోహన్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపల్లెలో దంతవైద్య శిబిరం

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం తిరుమల డెంటల్ కాలేజ్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు ప్రజలకు దంత పరీక్షలు చేసి, పలు సూచనలు చేశారు.

మేడే వారోత్సవాలు

ధర్పల్లి: మండల కేంద్రంలో మంగళవారం బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాలు భాగంగా ఎర్ర జెండాను ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పద్మ, భూమేష్, ఎల్లయ్య, కృష్ణ ఉన్నారు.

శబరిమాత ఆశ్రమానికి రూ.2లక్షలు విరాళం



సుభాష్‌నగర్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల శబరిమాత ఆశ్రమ నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ రూ.2లక్షల విరాళాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామర్తి గంగాధర్, బంటు రాము, మహిళలు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

నిజామాబాద్‌నాగారం: మా అమ్మాయి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని అక్షిత తండ్రి ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ఏడాది నవంబర్ 13న నగరంలోని ముబారక్‌నగర్ శ్రీనిధిహాస్టల్ భవనం పైనుంచి పడి అక్షిత మృతిచెందిందన్నారు. పాపను బిల్డింగ్ మీద నుంచి తోసేసి చంపారని నవంబర్ 14న మాక్లూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. హాస్టల్ వారు ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును క్లోజ్ చేశారన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్‌కు, సీపీకి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కేసును రీఓపెన్ చేసి తమకు న్యాయం చేయాలన్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

ధర్పల్లి/సిరికొండ/జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి/నిజామాబాద్ సిటీ: తమ సమస్యల పరిష్కారం కోసం నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె మంగళవారం ఐదో రోజు కొనసాగింది. తమను రెగ్యులర్ చేసేదాకా సమ్మెను ఆపేది లేదని జేపీఎస్‌లు పేర్కొన్నారు.